# అప్పారావోపాఖ్యానం

తా త పూ డి

అప్పారావు ఉరఫ్ అప్పల్రావు ఆదరాబాదరా పరుగులాంటి నడకలో వురికి వచ్చేసరికి ఆఫీసంతా కలకలంగా వుంది. అలా కలకలంగా వుందంటే ఏదో విశేషం వుండి వుండాలి. బహుశా ఆఫీసరుగారు అమ్మగారిమీదనో- అమ్మగారు ఆఫీసరుగారి మీదనో అలిగి వుండాలి- లేదా అమ్మగారి ఆజ్ఞప్రకారం ఎవడో అప్రాచ్యుడు నెల్లూరు మొలగొలుకులో - గద్వాల్ పట్టుచీరలో తేలేదనే నెపంతో... వాడిని సర్ప్రైజ్ విజిట్ చేసి ఎకాఎకీ శంకరగిరిమాన్యాలు పంపించమనే ఇంజెక్షనుతో కాంపుకి పోయి వుండొచ్చు. లేదా తనకింద ఆఫీసర్లు (సబార్డినేట్ అంటే తన కాలి కింద బలాదూరనో చెప్పు కింద తేలనో... మరో పర్యాయపదం అడ్డమైన చాకిరీ చేసే అడ్డగాడిద (ఎ.జి.) అనో ఏదో ఒకటి) తనకీ మధ్య ఫైనల్ బిల్సులోనూ టెండర్ షెడ్యూల్సులోనూ ఎన్నమ్మార్లలోనూ యివ్వవలసిన పరసంటేజికోసం ఇన్స్పెక్షన్ నెపంతో అదైనా అమ్మగారి ప్రత్యక్షపోరాటం ఎదుర్కోలేక వెళ్ళయినా వుండవచ్చు. అదీ కాకపోతే అమ్మగారు ఐ. సి. ఎస్, ఛార్జి (వంట కార్యక్రమం వగైరా) తగిలించి ఆఫీసు టపాలేవో ఆ వంట చేస్తూ అఘోరించమనె తాఖీదు యిచ్చి వుంశవచ్చు.

ఏదిఏమైనా తను లేటుగా వచ్చినందుకు ఏ అప్రాచ్యుడైనా "లేటుగా వచ్చావేం? అని వెకిలిచూపు చూడకుండా సర్దుకుపోయింది.

"హమ్మయ్య - సూపర్నెంటుగారు ఇంకా రాలేదు. బహుశా ఆఫీసరు దర్శనాపేక్షతో శ్రీవారి వాకిటియందు వేచియుండవచ్చు" అని సంతృప్తిపడి హడావిడి పడిన తన గుండెలమీద ఒక్కసారి చెయ్యిపెట్టి తడుముకుని సీటులో కూలబడ్డాడు. మన అప్పారావు అటెండెన్సులో ఓ కలం పోటుపొడిచి. అతనిరాక గమనించిన తోటి గుమాస్తాలు అంటే గుదిబండలా రాత్రింపగళ్ళు కుర్చీని అంటుకుపోయి పనిచేసి - మార్కుల కోసమని తంటాలుపడి .... కాకాలో క్లైమాక్సుకుపోయి ఆఫీసరుచేత కారుకూతలుపడి .... స్థానబలం లేక నల్లిలా నలిగిపోయే శ్రమజీవి అంటే అడ్డమైన పనీచేసి అప్రిసియేషన్ పొందలేని అభాగ్యుడు అంటే సరి, కంగ్రాచ్యులేషన్సు చెప్పారు.

ఈ అనుకోని సంఘటనకు ఉక్కిరిబిక్కిరయిపోయాడు. సంగతి సాంతం అర్థంకాకపోయినా గాల్లో తేలిపోతున్నట్టు కలగని గతుక్కుమని అసలు సంగతి తెలుసుకోకుండా అది అందుకునే దమ్ము

ల్లేక ఏమిటి సంగతని ? నిలేశాడు తన గారపళ్ళను అందరికీ చూపేలా ఓ వెకిలి నవ్వు నవ్వి-

యిక్కడ అప్పారావు గురించి నాలుగు ముక్కలు వివరిస్తాను - అప్పారావు సార్థక నామధేయుడు - అప్పు రూపంలో డబ్బు యిచ్చే వాడు వుండాలి గాని.... ఏదో విధంగా ముఖం తెలియని వాడైనా పరిచయం సంపాదించి - తైరు వడలా వుబ్బేసి ఎంతో కొంత డబ్బు లాగడంలో ఘటికుడు.

అందుకు తన గుణగణాలు మెచ్చుకుంటూ మన వాళు ఎత్తికుదేస్తున్నారేమో.... కాస్త కాఫీనీళ్ళ కోసమని అనుకున్న తనకి అడగటమే పాపంగా సిబ్బంది క్లార్కు ఇబ్బందిగా ముఖం పెట్టి - సదరు అప్పారావు చేతిలో ఓ కాగితం పెట్టి తన విక్రమార్క సింహాసనానికి దారితీశాడు.

ఆ చేతిలో కాయితం యిప్పి చూసే సరికి పై ప్రాణాలు పైనే పోయాయి- ఫ్యాను గాలికి కాయితం రెపరెపా కొట్టుకుని గాలిలో ఆకాశంలోకి ఎగిరినంత పనిజేసి పక్కాయన డ్రాయరులోకి దూరి పోయింది. (కొంప తీశారు. డ్రాయరు పర్యాయపదం. మరోటి అనుకోబోకండి సుమా.)

బుర్రంతా గిర్రున తిరిగినట్లైంది.

గత రోజు జరిగిన సంఘటన కళ్ళకు కట్టినట్లైంది. ఏమీలేదు. ఆఫీసరుగారు వెన్నపూస తెమ్మని ఇండెంటు వేశారు, అసలే తను అప్పుల్లో మునిగి వుండి.... అప్పనంగా వెన్నపూసతో మాలిష్ పట్ట లేక 'సారీ' అని ఓ చిట్కా వదిలి బయటకు వచ్చాడు. ఆ దెబ్బతో వారి అహం దెబ్బతిని, తొకతొక్కిన తాచై, అప్పుడే తను (ఫుటప్) సమర్పించుకున్న సదరు ప్యాడ్‌ను విసిరిపారేసి 'ఈజ్'కి 'వజ్'కి తారతమ్యం లేదని చిరబుర లాడాడు. అలాగైతే బాగానే వుండేది. నిన్న, తలుచుకుంటే అండీ, సీట్సు లేనిచోటుకి ట్రాంన్స్ఫర్ చేయిస్తానని సవాలు చేశాడు.

ఇక ఆలోచించలేక పోయాడు. ఆఫీసరుగారు వెధవ వెన్నపూస కోసం కక్కుర్తిపడి తన్ని పక్కనే వున్న శీతంపేట ట్రాన్స్ఫర్ చేయించాదన్న మాట. అనుకున్నాడు- అలాగనుకోడమే తరువు- తన చింపిరితలతో పాల సీతమ్మ-బొర్ర కడుపుతో కిరాణా సుబ్బయ్య-యముడిలా ఆ వడ్డీల నారాయణరావు తన కళ్ళలో మెదిలారు.

'అమ్మబాబోయ్! వాళ్ళకీ విషయం తెలిసిందంటే ఇంకేమైనా వుందా! కొంప మునిగిపోదూ? చావుకబురు చల్లగా చెప్పినట్లు ఎవరైనా నోట్లో నువ్వుగింజ నానక మోశాడంటే కిట్టెలు లేకుండా నన్ను మోసేస్తారు" అని కొంతసేపు వణికిపోయాడు.

ఈ విషయం బయటికి పొక్కకుండా వుండాలంటేసూపర్నెంటుని కాకాపట్టాలి. అవసరమయితే కాళ్ళు కూడా పట్టాలివెలా?

తనకి కాకాపట్టే మంచలవాటు లేదే- అవసరమై వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టాడు. తను ఈ గాడిదకాళ్ళు పట్టాల్సిందేనని నాలిక్కరుచుకుని తన నోటి దురుసుతనానికి మనసులోనే క్షమార్పణ చెప్పుకుని అస్మదీయ సింహాసనమ్మించి లేచి తసమదీయుల కాళ్ళమీద పడినంత

పనిచేశాడు.

సూపర్నెంటు చిరునవ్వు అనబడే ఓ మాయలఫకీరు నవ్వు నవ్వి సరేనన్నాడు. ఏది ఏమైతేనేం తన బదిలీ నాలుగ్గోడల మధ్య బంధించబడింది.

వామపక్షం అనబడే తన తోటి కొందరు మిత్రులు శాసనసభలోని ప్రతి పక్షాల్లా... పై వర్గంవారి పలుకుబడిసంపాదించి .. పై ఆఫీసరు వారిచేత ఆర్డర్లు.... కొండెక్కించమని (కాన్సిల్ చేయించమని) ఓ ఉచితసలహా ఉవాచించారు.

కాని అప్పారావుకి ఉత్తర దక్షిణాలు (రికమండేషను-లంచం-బహుమతి-మామూలు వగైరా) అసల్లేవు. పై వర్గంలో పలుకుబడిలేదు. ఆ పలుకుబడి వుంటే పార్టీ మారిన నాయకుల్లా ఎప్పుడో ఊసరవెల్లిలా రంగు మార్చేవాడు. అందుకే ఆ రోజు పొద్దున్నే సరిగ్గా పదిగంటల నలభై నాలుగు నిమిషాలకు ఠపీమని రిలీవు చేసి పారేసారు. వెంటనే పేటలో చేరి పొమ్మని - పైగా జాయినింగ్ టైం తప్పించి ట్రాన్సిట్ వాడుకొనే యోగం లేదని హుకుం జారీచేసారు.

మంత్రసాని తనం ఒప్పుకున్నాక ఏమైనా తప్పదుమరి. మొదట్లో బాకీలకు ఐ. పి. పెట్టి బాకీదారుల నెత్తిమీద సైను గుడ్డ నైస్‌గా ముసుగేసి చెక్కేద్దామని చూశాడు. పాపం - ఎప్పుడైనా కనిపిస్తే చింతకుకట్టి చితక్కొడతారనుకో లేదు.

పైగా ఓవర్ నైట్‌ని ఫామిలీ అనబడే తన కమటాన్ని మార్చేదామనుకుని ఫీజులేని తన శ్రీమతి ఉచిత సలహానను సరించి ఆ రోజునే పేటలో చేరటానికి బయల్దేరాడు. అప్పటి కప్పుడే యింటి పక్కనున్న శెట్టిగార్ని ఓ పది అప్పు తీసుకుని అప్పారావు.

శీతంపేట చేరేసరికి సరిగ్గా రెండుగంటలయింది. ఆఫీసుకి వెళ్ళాడు కదా ఒక్క పిట్టకూడా లేదు. ఆఫీసుని అర్ధనగ్నంగా వదిలేసి వెళ్ళి పోయారు బాంఛోతులు.... సారీ బంట్రోతులు. పైగా అది లంచి హవరాయె - ప్రభుత్వంవారు నిర్ణయించిన కాలం ముప్పావు గంటయితే నాచురల్‌గా లంచవరు రెండు గంటలు. (అంటే యింటికి వెళ్లి మస్తుగా భోంచేసి మగతగా ఓ గంట నిద్రోడం)

ఎవడేనా గట్టిగా మాట్లాడితే హెడ్డు లాంటివారే (ఆఫీసరు) సరిగ్గా ఆఫీసు టైము అయిపోతోందనంగా అంటే నాలుగుముప్పావుకి దిగుతారు ఏదో కొంప మునిగిపోయినట్టు, సాగర్‌కాలవకరకట్ట కొట్టుకుపోయినట్టూను. సదరు హెడ్‌గారు ఎవైల్ చేసుకోగాలేంది, మనం చేసుకోవడంలో ఔచిత్యం లేదా అని వేలెత్తి చూపుతారు విబుధులు- తందాకా వస్తే గాని తగువు దీరదన్నట్లు అధవ ఏ వె. ధ. వ అయినా (వెంటూరి ధర్మరాజు వర్మ అన్నమాట) లేటుగా వస్తే చెవ

బాలెక్క—తీసి కాయితంమీద సంజాయిషీ అడిగి, ఓపూట లీపుగా గొరిగి, పెద్ద రాద్ధాంతం చేస్తేగాని వదలరు శాఖా కాపరులు (అంటే మన పరిభాషలో సెక్షన్ ఆఫీసరు).

ఆలోచనల నుంచి తేరుకునేసరికిభుజం మీద తన కొలీగ్ (తద్దినం పెట్టేవాకి తమ్ముడిలాంటివాడు) చెయ్యేయడం యిహలోకంలోకి రావడం జరిగింది. జనమేజయ మహారాజు సూతులవారి బోధలు విన్నట్లు తన కోలీగ్ విషయమంతా అప్పారావు ద్వారా విని ఓ చిన్న సానుభూతిలాంటిది విసిరి – బోదురు కప్పగార్ని (వాళ్ళపరిభాషలో ఆఫీసరు–ఎంచేతనంటే బోదురు కప్పలా బెకబెకలాటి అడ్డమైన చాకిరీ చేయించి సతాయించడమే కాకుండా సదరు ఉద్యోగస్తుల కాన్ఫిడిన్షియల్ రిపోర్టుల్లో (దీనికి మరోపేరు కాకా....లోకేయం) రిక్వయిర్స్ గోడింగ్ అని ఉటంకిస్తాడని) కలుసుకోమని అడగని ఎక్స్‌యిజ్ పారేసి తన సీటు అనబడే చేతులు చట్రం విరిగిపోయిన పాత మోడల్ కుర్చీలో కూలబడ్డాడు.

అప్పారావు ఏకాఏకీ అడ్డగాడిదగారికి (ఆఫీసరుకి మరోపేరు – ఆ పేరెందుకు వచ్చిందంటే పై గాడిదలువస్తే అడ్డమైన చాకిరీచేసి రాబోయే ప్రమోషను కోసం తన చిత్రగుప్తుడి చిట్టాలో ఎంత పనయినా ఒళ్ళువంచి అడ్డగాడిదలా చాకిరీ చేస్తాడని రాయించుకుందేవాడని ఉవాచ) గుడ్డుమార్నింగు లాంటిది వేలితో ఓటివిసిరి (ఎవరైనా పరాకున చూస్తే చూసోక్క నీపని పడతాను జాగ్రత్త అన్నట్టుగా) చేతులు కట్టుకున్న వైతాళికుడిలా నించున్నాడు. ఆఫీసరు గారికి కూచోమనడం అలవాటులేదు కాబట్టి పైగా వారికాళ్ళు లాగవు కాబట్టి. వారు ఏమిటన్నట్లు మిర్రి మిర్రి చూశాడు.

అప్పారావు ఒణికిపోయానను కున్నాడు. నోటంట మాటరాలేదు.

సదరు ఆఫీసరుగారు మళ్లా ప్యాడ్‌ల్లో మునిగిపోయారు పరపరా నాలుగు ప్యాడ్‌ల మీద పనసకాయ చెక్కినట్లు "బ్రింగ్ దిస్ కేస్" అని అందంగా చెక్కి పక్కనే వున్న ట్రేలోకి విసిరి, పెద్ద అలిసిపోయినట్లు ఓ నిట్టూర్పు విడిచి "ఎవరు నువ్వు?" అన్నాడు కొరికేసినట్లు చూసి.

రెక్కా కాలూ కూడదీసుకుని .... గొంతు సవరించుకుని నాటకంలో డైలాగ్స్‌లా 'నన్ను మీ ఆఫీసుకి ట్రాన్స్ఫరు చేశారు'' అని అనగలిగాడు. అయి జాయినవుతావా? అని అడిగాడు. అప్పారావు 'అవును' అని గంగిరెద్దులా బుర్ర వూపాడు. వెంటనే కాలింగ్‌బెల్ నొక్కి తన్మదీయ సిబ్బంది గుమాస్తాని కబురు పెట్టాడు యిబ్బంది ఫీలవుతో–

చేతులు కట్టుకుని వచ్చిన ఈ.సీ. అప్పారావు ఆగమన విశేషం విన్నవాడై ఆఫీసువారి కేవిధమైన కాయితాలూ రాలేదని తోక యూడించాడు. కాని అస్మదీయ అప్పారావు తనకిచ్చిన ఆర్డర్ల మీద జాయిన్ చేసుకోమని అడగడం రెఫ్యూజ్డు అన్నట్టుగా పెట్టిన ఆయన పోజు చూసి అంతలోనే గతుక్కుమని వినయంతో యింకా నిలుచుండగా 'అబ్బాయ్ – పార్టీ

కాఫీ మీద చేర్చుకోడానికి నాకు సర్కారు వారు పరిమితించలేదు. అందువల్ల తత్సంబంధమైన తాఖీదు తెచ్చుకోమని సెలవిచ్చాడు.

వెంటనే ఖిన్నుడై అప్పారావు ఉసు రోడ్డు పట్టి నాలుగ్గంటలకి తిరిగి ఆఫీసుకి వెళ్ళ సూపరెన్టెంటు వారివద్దకు ఆదరాబాదరా వెళ్ళాడు. సూపరెన్టెంటుగారు తన గారపళ్ళ నవ్వుని కమ్మగా చూపించి కూర్చోబెట్టాడు.

'అయ్యా! పేట ఆర్డర్సు వెళ్ళకుండా నన్ను రిలీవ్ చేసిందే కాకుండా నాచేత రెండు పదులు ఖర్చుపెట్టించారు. మీకిది న్యాయంగా వుందా? అని అడిగేశాడు బల్లగుద్ది–

సూపరెన్టెంటు కంగుతిని కంగారు పడ్డాడు.

ఏమీలేదు. అసలుసంగతి పసికట్టాడేమోనె– కాని అంతలోనె తమాయించుకుని అప్పటికే బల్లచుట్టూచేరిన (పేషంటు చుట్టూచేరిన డాక్టర్లలా) స్టాఫ్‌కేసి చూశాడు సూపరెన్టెంటు.

అంతా గొల్లున నవ్వారు–

అప్పారావుకి అసలుసంగతి అర్థం కాక... నిజంగా ఏడుపువచ్చినంత పనయి ఏడవలేక అందరితో నవ్వాడు పేలవంగా—

వెనకనుంచి ఎవరో 'ఏప్రిల్ ఫూల్' అని అరిచాడు. అప్పారావుకి బాగా వినపడేలా —

అప్పారావు మళ్ళీ ఇరవై రూపాయలు అప్పు అయినానే అని ముఖం చిన్నబుచ్చుకున్నాడు


## చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి | రు. 2-00 |
| సంవత్సర చందా | 25-00 |
| (ఆగస్టు 15 సంచిక విడి ప్రతి 3-00) | |
| సంక్రాంతి స్పెషల్ | 5-00 |
| మొత్తంగా | 30-00 |

## అనామిక ప్రకటన రేట్లు

| | |
|---|---|
| కవరుపేజీ | రు. 300-00 |
| 2 & 3 కవరు పేజీలు | 250-00 |
| ఓపెనింగ్ | 250-00 |
| పూర్తి పేజి | 200-00 |
| పేజిలో సగం | 100-00 |

"అనామిక" అన్ని హిగ్గిన్ బాదమ్సు, రైల్వే బుక్ స్టాల్సులోను దొరుకుతుంది.